క్లుప్తంగా

దీపారాధన



మెట్టవలసలో దీపారాధన చేస్తున్న మహిళలు

బొబ్బిలి: మఖ పూర్ణిమ(మాఘమాస పౌర్ణమి) పురస్కరించుకుని, మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు, రామమందిరాలు, వేంకటేశ్వరాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు చేరుకున్న భక్తులు దీపారాధనలు, అభిషేకాలు, అర్చనలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

సంతకవిటి: మండలంలోని ముకుందపురం గ్రామంలో సీతారాముల ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పులఖండం శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ బాగుండాలని భక్తులు వేడుకున్నారు.

బాడంగిలో 'చదవడం మాకిష్టం'



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పాఠకులతో పలు పుస్తకాలు చదివించారు. అలాగే పిల్లలతో కథలు చెప్పించి, దానిలో ఉన్న నీతిని గ్రహించేలా చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఆర్.దుర్గాప్రసాద్, పిండ్రంగివలస హెచ్ఎం రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పీపీఆర్ వ్యాక్సినేషన్



వి.చిన్నయ్యపేటలో గొర్రెలకు వ్యాక్సిన్ వేస్తున్న సచివాలయ పశుసంవర్ధక సహాయకుడు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో పీపీఆర్ వ్యాక్సినేషన్ చురుగ్గా కొనసాగుతోంది. మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గొర్రెలకు పీపీఆర్ వ్యాధి రాకుండా సచివాలయ పశుసంవర్ధక సహాయకులు వ్యాక్సిన్లు వేస్తున్నారు. అనంతరం వ్యాధి లక్షణాలు, నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

కుదమ తిరుమలరావుకు సన్మానం



కేటీఆర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాజాం: రాజాం రచయితల వేదిక సభ్యుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదమ తిరుమలరావు(కేటీఆర్)ను ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక సన్మానించింది. ఇటీవల కాశీబుగ్గలో జరిగిన ఉత్తరాంధ్ర మహాసభల కవిసమ్మేళనానికి ఆయన పంపిన కవిత ఎంపిక కావడంతో ఆయనను సత్కరించి, ప్రశంసాపత్రం అందించినట్లు తిరుమలరావు ఆదివారం తెలిపారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు

గరుగుబిల్లి: రబీలో మొక్కజొన్న సాగు రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణపై ఆదివారం ఆమె అవగాహన కల్పించారు. నీటి వసతి తక్కువగా ఉన్న మెట్టభూముల్లో నవంబరు నెలాఖరు నుంచి జనవరి వరకు విత్తనాలు విత్తుకోవచ్చన్నారు. ఎకరాకు 7 నుంచి 8 కిలోల విత్తనాలు అవసరం. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసల మధ్య 2 1/2 అడుగులు, మొక్కల మధ్య 8 అంగుళాల దూరం ఉండేలా విత్తనాలు విత్తుకోవాలి. విత్తనాలు విత్తే ముందు ఆఖరి దుక్కిలో 50 కిలోల డీఏపీ, 40 కిలోల యూరియా, 35 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. విత్తిన నెలరోజులకు 35 కిలోల యూరియా, 60 రోజులకు 35 కిలోల యూరియాను మొక్కకు దగ్గరలో వేసుకోవాలి. పంటలో జింకులోపం ఎప్పుడైనా కనిపిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉంది.

ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నేతలు, కార్యకర్తలు

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో ఆదివారం సమావేశమైన వారు ప్రభుత్వంపై టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. ఎన్నికల హామీల్లో దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీదేనన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమన్యాయం చేస్తున్న గొప్పతనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు, వైఎస్సార్ రైతుభరోసా, వాహన మిత్ర పథకాలను అందించడం జరుగుతోందన్నారు. అలాగే పేదవాని సొంతింటి కల నెరవేర్చుతున్నారని, నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చుతున్నారన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు చేపడుతున్నారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా లబ్ధిదారులకు పారదర్శకంగా పథకాల లబ్ధి అందించడం జరుగుతోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతోందని, దీన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గృహసారథులతో పాటు మనందరిపైనా ఉందన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం ద్వారా ఆ ఇంటికి కలిగిన మేలును వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు వివరించాలన్నారు. అలాగే గతంలో టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను స్పష్టంగా తెలియజేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటై, వచ్చినా 2024 ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్ సీపీదేనన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా కృషి చేయాలని కోరారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బుడా చైర్మన్ ప్రతినిధి ఇంటి గోపాలరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ డబ్ల్యూఎస్ రాయులు పాల్గొన్నారు.

మజ్జిగౌరమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే జోగులు



మజ్జిగౌరమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న మజ్జిగౌరమ్మ యాత్రా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆఖరి రోజు వేల సంఖ్యలో భక్తులు గ్రామం చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఆయన సోదరుడు కంబాల మరియదాసు, పార్టీ రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు, సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు కూడా అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. యాత్రలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారులు

బొబ్బిలి: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రామభద్రపురం మండలంలోని ఎస్.సీతారంపురం గ్రామ జగనన్న కాలనీ లబ్ధిదారులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి, రహదారి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే వారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ పి.గణపతిరావును ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్మాణాలకు అవసరమైన సామగ్రి, డబ్బులను ప్రభుత్వం అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రతీ కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో గొల్లపేట ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.రవణమ్మ, ఎస్.లక్ష్మి, వి.చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



అవగాహన కార్యక్రమంలో ఏఓ శిరీష, సర్పంచ్ శివున్నాయుడు తదితరులు

బాడంగి: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని సర్పంచ్ చప్ప శివున్నాయుడు అన్నారు. మండలంలోని ముగడ గ్రామంలో నవధాన్యాల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులంతా సేంద్రియ వ్యవసాయం చేసి, గ్రామాన్ని బయోఫెర్టిలైజర్ గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంటలను సేంద్రియ విధానంలో సాగు చేసి, ఆరోగ్యవంతమైన పంటను అధిక దిగుబడిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శిరీష తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట

మెంటాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో శ్రీబంగారమ్మ తల్లి, గడ్డిపోలమ్మ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమంను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు

నేడు బొబ్బిలిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బొబ్బిలి: పట్టణంలోని మూడో సచివాలయం పరిధిలో ఉన్న ఐదో వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అధికారులు ఆదివారం తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరు కావాలని కోరారు.

పాలిథిన్ కవర్లు వినియోగించొద్దు

రాజాం: నిషేధిత ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లు వినియోగించవద్దని పట్టణ వాసులకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. ఆదివారం శ్రీనివాసా మార్కెట్ రోడ్డు, ఆర్టీసీ ఇన్‌గేట్ వద్ద పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టిన ఆయన ప్లాస్టిక్, పాలిథిన్ సంచులు విక్రయించినా, వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎల్లోమీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష టీడీపీ, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొట్టాలని బొబ్బిలి సోషల్ మీడియా వారియర్స్‌కు ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా వారియర్స్‌తో ఆదివారం సమావేశమైన ఆయన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. తాజా సమాచారం ప్రజలకు అందించే బాధ్యత సోషల్ మీడియా వారియర్స్‌పై ఉందన్నారు. టీడీపీ, ఎల్లోమీడియా ప్రభుత్వం, అధికార పార్టీ నేతలపై చేస్తున్న ఆరోపణలు కేవలం ఆరోపణలేనని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి గాయత్రిదేవి యాత్ర



రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలో గాయత్రిదేవి యాత్ర ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానందరావు ఓ ప్రకటనలో ఆదివారం వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అమ్మవారికి విశేష పూజలతో పాటు కుంకుమార్చనలు జరపనున్నామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే పట్టాలు రద్దు



కాలంరాజుపేటలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలిస్తున్న హౌసింగ్ ఏఈ వెంకటేష్

తెర్లాం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా మంజూరైన ఇళ్లను నిర్మించకపోతే పట్టాలు రద్దు చేస్తామని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.వెంకటేష్ అన్నారు. మండలంలోని పూనువలస పంచాయతీ పరిధిలో ఉన్న కాలంరాజుపేటలోని జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలను త్వరితగతం చేసి, ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలన్నారు. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించని జాబితా ఇవ్వాలని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించామని, జాబితాలు వచ్చిన వెంటనే పట్టాలు రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఆయన వెంట సర్పంచ్ రమణమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మీనాక్షి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని మందరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు(1977–78 బ్యాచ్) ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సాయంత్రం వరకు కబుర్లు, ఆటపాటలతో సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన వావిలపల్లి రమణారావు, ఎస్ఎస్ఎస్ చంద్రరావు, జీవీ సన్యాసిరావు, బి.త్రినాథరావు, సీతారామ్మూర్తి, కేఎల్ నారాయణలను సన్మానించారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి



విద్యార్థులతో ఇంగ్లిష్ పుస్తకాలు చదివిస్తున్న హెచ్ఎం సత్యనారాయణరావు

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని, దీనికోసం పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని మండలంలోని వెలగవలస హైస్కూల్ హెచ్ఎం, ఆంగ్ల ఉపాధ్యాయుడు ఆర్.సత్యనారాయణరావు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన విద్యార్థులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. ఆంగ్ల భాషపై ఉన్న భయం వీడాలన్నారు. తరచూ ఆంగ్ల పాఠ్యపుస్తకాలు చదివించడం, కథలు చెప్పించడం, రాయడం, వ్యాకరణం నేర్పించడం ద్వారా ఆ భాషపై పట్టు వస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

రూ.1.30 కోట్లతో ఆలయ నిర్మాణం



అంబకండిలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి ఆలయం

రేగిడి: మండలంలోని అంబకండి గ్రామంలో రూ.1.30 కోట్ల వ్యయంతో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం నిర్మాణ పనులు ఆఖరు దశకు చేరుకోగా, మే 1, 2, 3 తేదీల్లో ఆలయ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించేందుకు గ్రామస్తులు నిర్ణయించారు.

ఆధ్యాత్మికతతోనే ప్రశాంతమైన జీవితం



టీటీడీ ధర్మ ప్రచారకులు వెంకటనాయుడును సత్కరిస్తున్న సత్యనారాయణనాయుడు

రేగిడి: ఆధ్యాత్మికతతోనే ప్రశాంతమైన జీవితం గడపవచ్చని టీటీడీ ధర్మ ప్రచారకులు, పురాణ ప్రవచన శిరోమణి బాడాన వెంకటనాయుడు అన్నారు. స్థానిక దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యనారాయణనాయుడు అధ్యక్షతన దత్త జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ఆయన కలియుగంలో ప్రతీ మనిషి కాంతా కాంచనాలకు లోనవుతుంటారని, ఎవరైతే వాటికి లోనుకాకుండా ఆదర్శంగా జీవిస్తారో వారే సమాజంలో వెలుగొందుతారన్నారు. అందుకే మనిషి మనిషిగా జీవించాలంటే ఆధ్యాత్మిక మార్గాన్ని తప్పనిసరిగా అనుసరించాలన్నారు. అనంతరం వెంకటనాయుడుతో పాటు ఆధ్యాత్మిక వక్తలు ఆరికట్ల కామేశ్వరరావు, జడ్డు అప్పలరాం, లక్ష్మణరావులను సత్యనారాయణనాయుడు, దత్తపీఠం కన్వీనర్ రుంకు శ్రీనివాసరావు దుశ్శాలువ, మెమెంటోలతో సత్కరించారు.

విచారణ పేరుతో తీవ్రంగా కొట్టడం సరికాదు

గుమ్మలక్ష్మీపురం: విచారణ పేరుతో గిరిజనుడిని తీవ్రంగా కొట్టి ఆస్పత్రి పాలు చేయడం ఎల్విన్‌పేట పోలీసులకు ఏమాత్రం తగదని గిరిజన జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని జనరేటర్ చోరీకి గురైందంటూ పాఠశాల డిప్యూటీ వార్డెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కొండగొర్రి కామరాజు అనే గిరిజనుడిని విచారణ పేరుతో ఎల్విన్‌పేట పోలీసులు తీవ్రంగా కొట్టిన సంగతి విదితమే. చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయిన కామరాజును లక్ష్మణమూర్తి ఆదివారం దుడ్డుఖల్లు వెళ్లి పరామర్శించారు. కామరాజు, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేరం నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు చేపట్టాలే గాని, నేరం నిర్ధారణ కాకుండా ప్రాథమిక విచారణ పేరుతో తీవ్రంగా కొట్టడం సరికాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరారు. బాధితుడు కామరాజుకు న్యాయం చేయాలన్నారు.

ఏప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ ఏక్తా ర్యాలీ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో చేపట్టనున్న మజ్దూర్ కిసాన్ ఏక్తా ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలో జరిగిన కార్మికుల సమావేశంలో పాల్గొన్న ఆయన బీజేపీ ప్రభుత్వం కార్మికుల జీవన విధానంపై దాడి తీవ్రతరం చేసిందని, కార్పొరేట్ల కోసం శాశ్వత ఉద్యోగుల స్థానంలో అప్రెంటీస్, ట్రైనీ పని విధానాన్ని తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్మే పనిలో పడిందని, కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టుబానిసలుగా మారుస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సత్యారావు, సురేష్, ఆదయ్య, ప్రసాద్, లక్ష్మణరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో టీడీపీ భూస్థాపితం ఖాయం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: యువగళం పేరిట టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రతో ఆ పార్టీ భూ స్థాపితం కావడం ఖాయమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన రాజకీయ పరిజ్ఞానం లేని లోకేష్ యాత్ర నవ్వుల యాత్రగా కొనసాగుతోందని విమర్శించారు. తొలిరోజు ప్రసంగంలోనే ప్రశాంతతకు బదులు ప్రశాంత అత్త, జీవోకు బదులు జియో వంటి మాటలతో సభకు వచ్చిన వారందరికీ చాలా మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చారన్నారు. యాత్ర పొడవునా వారు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం చేశారో గానీ అధికారంలోకి వస్తే ఏం చేస్తారో చెప్పడం లేదన్నారు. గతంలో ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను ఆ తర్వాతి ఎన్నికలకు రెండు నెలల ముందు నెరవేర్చి ఐదేళ్ల పాటు హామీలు అమలుచేసినట్లు మాయమాటలు చెబితే ఎవరు నమ్ముతారన్నారు. టీడీపీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. జనమంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించిన ఘనత వైఎస్సార్ సీపీదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.